

పూర్వము పాంచాలదేశమును వీరసింహుడను రాజు పాలించుచుండెను. ప్రజలను కన్న బిడ్డలవలె జూచును వారిసౌఖ్యమే తన సౌఖ్యముగాను వారి యిక్కట్టులె తన యిక్కట్టులుగాను భావించుచు రాజ్యము కడు చాక చక్యముగా పాలించుచుండెను. కాని అతనిలోని ముఖ్య లోపమొకటి కలదు. అతడు దయ, కోపము హద్దులో నుంచుకొనలేని ఆగ్రహ పరుడు. ఆ రాజ్యమునకు ధర్మబుద్ధి అనునాతడు మంత్రిగా ఉండెను.

ఒకనాటి నిండు పేరోలగమున రాజు వీరసింహుడు మంత్రిని పిలచి 'మంత్రివర్యా! తమను నేను మూడు ప్రశ్నలడిగెదను. ఆ ప్రశ్న

లకు తక్షణము ఉన్నపాటున సరి యైన సమాధానము చెప్పవలయును' అనెను. మంత్రి 'సరే! ఆ ప్రశ్నలు సెలవిండు! జవాబు చెప్ప ప్రయత్నించెద'నని వినమ్రుడై పల్కెను అంతట రాజు ఇవే నా మూడు ప్రశ్నలు: "భగవంతుని ఉనికి ఎక్కడ? ఆ భగవంతుడేమి చేయుచుండును? నేను నా మదిలో ఏమని తలంచుచున్నాను?" అని ప్రశ్నించెను. మంత్రివర్యుడ కెంతతడ వాలోచించినను జవాబులు దొరకలేదు. రాజుకు నమస్కరించి 'మహారాజా ఈ ప్రశ్నలు కడు కఠినముగా ఉన్నవి. జవాబు లున్నపాటున మనవిచేయుట చాల దుష్కరము. ప్రభువులు కరుణించి ఒక పక్షము రోజులు గడువిచ్చిన దీర్ఘాలోచన చేసి సరియైన సమాధాన మిత్తు'నని మనవి చేసెను. రాజు సరే అని నీవు కోరినట్లు పక్షముల్రోజులు గడువిచ్చుచున్నాను. ఈలోపల సరియగు జవాబు చెప్పలేనియడల నీ శిరస్సు దీయించి కోటగుమ్మమునకు వేలాడ గట్టించెదను. అని పల్కెను.

మంత్రి రాజసభనుండి తన భవనమునకువచ్చి ఒంటిగా తన పడకగదిలో, గూర్చుండి ఆలోచించెను. ఎంత తలపగులగొట్టుకొన్నను మహారాజడిగిన ప్రశ్నలకు సమాధానములు తోచలేదు. గడువులోపల జవాబులు చెప్పకున్నచో తన ప్రాణములు రాజు తప్పక తీయించునని తలచి మంత్రి దిగులు చెందెను. ఆ మనోవ్యాకులతచే ఆహారము సయించుటలేదు. కంటికి కునుకులేదు. పాపము! ధర్మబుద్ధి నానాటికి తీసిపోవుచుండెను. దినములు గడుచుచుండెను ఇక రెండు దినములు మాత్రమే వ్యవధి యుండెను.

ఆ మంత్రికి పనిచేయు మంగలి అయచ్చముగా మంత్రి వలె ఉండును వారిరువురును ఒకేరకపు దుస్తులు ధరించిన గుర్తించుట అశక్యము మంత్రి దిగులునకు కారణమా మంగలియెరిగి మంత్రిని సమీపించి 'అయ్యా! ప్రభువులకు బదులుగా ఆ మూడు ప్రశ్నలకు రాజుగారి ఎదుట నేను సమాధానములు చెప్పెదను మీరు ధరించు దుస్తులు మాత్రము నాకిప్పింపుడు మీరు దిగులు జెందకు'డని పల్కెను. మంత్రి కొంచెమునే పాలోచించి జరుగునది జరుగక మానదని నిశ్చయించి మంగలి కోరినట్లు తన దుస్తులు వానికిచ్చెను.

రాజుగారి ప్రశ్నలకు ఈవేళ జవాబు లీయబడునని పురమంతయు దండోరా వేయబడెను దర్బారంతయు యిసుక వేసినా రాలనట్లు క్రిక్కిరిసి ఉండెను. రాజు మంత్రిని పిలిచి నా ప్రశ్నలకు జవాబులిచ్చుటకు సిద్ధముకమ్మని యాజ్ఞాపించెను. మంత్రి వేషమున నున్న మంగలి రాజునకు నమస్కరించి 'ప్రభూ! చెప్పెదువా రెప్పుడును' ఉన్నత స్థానమునను, వినెదువా రెప్పుడును క్రింద నుండుట వాడుక. కావున తమరు నా స్థానమున నిలువబడి మీ గద్దె నాకిప్పింపుడు, అని అతివినయముతో మనవి జేసెను. రాజంగీకరించి మంగలి జెప్పినట్లు చేసెను.

మంగలి సింహాసనముపై కూర్చుండి సేవకునిచే ఒక కాగిడా తెప్పించి 'అయ్యా ఈ కరదీపిక కాంతి ఎక్కడ నున్నదో సెలవిండు' అని పల్కెను. "అంతట నున్నది" అని వీరసింహుడు జవాబిచ్చెను మీ మొదటి ప్రశ్నకు సమాధాన మదియే. ఈ కాంతి వలెనే భగవంతుడును సర్వాంతర్యామి. ఇక రెండవ ప్రశ్నకు సమాధానము ఆలకింపుడు. 'మహా సామ్రాజ్యాధిపతులయిన మిమ్ము సింహాసనము నుండి దింపి నన్నెక్కించినాడు ఓడలు బండ్లు, బండ్లు ఓడలగునట్లు భగవంతుడే పైవారిని క్రిందికి, క్రిందివారిని పైకి మార్చుచుండును. ఇదంతయు ఆయన లీల. మరి మూడవ ప్రశ్నకు జవాబు చెప్పెద వినుడు. ఈ క్షణములో తమరు నన్ను తమ మంత్రిగానే మీమదిలో భావించుచున్నారు. నిజముగా నేను మంత్రి ధర్మబుద్ధిని గాను. నేను వారి మంగలిని. అని పల్కి వాడు గద్దెదిగి రాజు పాదములకు నమస్కరించి 'మహారాజా! మంత్రివర్యులు చెప్పిన విధమున చెప్పితిని. ఆపైన తమ అనుగ్రహము. మా ప్రాప్తి యని వినయముగా పల్కెను. మంగలి తెలివికి వాని యుక్తికి సభాసదులందరు మెచ్చిరి.

వీరసింహుడు మంగలి యుక్తికి సంతసించి ధనముతోను, మాన్యములతోడను వానిని సత్కరించెను. మంత్రిఎప్పటియట్లకొలువుసాగించుచుండెను ధర్మబుద్ధితన ప్రాణములు కాపాడిన మంగలితో స్నేహభావముతో మెలగుచు వాని నెంతో గౌరవించెను.

★